సీఎం జగన్‌కే ప్రజల మద్దతు

- 'జగనన్నే మా భవిష్యత్తు' ద్వారా తేటతెల్లం
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్


కేక్ కట్‌చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజలందరి మద్దతు వైఎస్సార్‌సీపీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఉన్నట్లు తేటతెల్లమైందని పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా పీపుల్స్ సర్వే ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలను కలిశామన్నారు. జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా 1.1 కోట్లకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని, ఇది చరిత్రాత్మకమైనదని అభివర్ణించారు. ఈ సర్వేలో నిష్పక్షపాతంగా ప్రజలు తెలిపిన విషయాలనే నమోదు చేశామని తెలిపారు.

సర్వే ఫలితాలతో ప్రతిపక్షాలకు షాక్

పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 75 వేల కుటుంబాలను కలిశామని, ఇందులో 49 వేల మిస్డ్ కాల్స్ వచ్చాయని ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. మెగా పీపుల్స్ సర్వే ఫలితాలతో ప్రతిపక్షాలకు షాక్ కొట్టిందని, దీన్ని జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మా నమ్మకం నువ్వే జగన్ నినాదం మార్మోగుతోందన్నారు. ఈ సర్వేలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ(ఆల్ఫా కృష్ణ), కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, ముర్రు వాణి నానాజీ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, రెడ్డి కార్పొరేషన్ సభ్యుడు బారి శ్యామ్‌కుమార్‌రెడ్డి, వి.గోవింద్, పూడి మల్లేశ్వరరావు, పీలా మాధవి, జేసీఎల్ క్లస్టర్ కన్వీనర్ పల్లా ఎర్నికుమార్, గేదెల మురళీకృష్ణ, పిల్లా కన్నబాబు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, చుక్క ప్రసాదరెడ్డి, అప్పలస్వామి నాయుడు, ఆడారి శ్రీనివాసరావు, దొడ్డి కిరణ్, రేవల్ల సత్యనారాయణ, గులిగిందల కృష్ణ, దాడి సత్యనారాయణ, భీశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా నిలుస్తా

ఆడారి ఆనంద్‌కుమార్


షాపును ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, జియ్యాని శ్రీధర్

మల్కాపురం: పేదలను ఆదుకుంటానని, కష్టకాలంలో ఉన్న వారికి అండగా నిలవడమే తన నైజమని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 60వ వార్డు గుల్లలపాలెంలో చింతచెట్టు కింద బ్యాగులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న రాజు అనే వ్యక్తి షాపును అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన రోడ్డున పడడంతో విషయం తెలుసుకున్న ఆడారి ఆనంద్‌కుమార్ రాజుకు అండగా నిలిచారు. అతని షాపు ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సాయం చేయడమే కాకుండా శనివారం ఆ షాపును ఆయన ప్రారంభించారు. దీంతో పారిశ్రామిక ప్రాంత దళితులు ఆడారి ఆనంద్‌కుమార్ చూపిన మానవత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు,పలు వార్డుల పార్టీ అధ్యక్షులు గులిగిందల కృష్ణ,పుర్రె సురేష్‌యాదవ్,నాయకులు కొల్లి నూక రెడ్డి,ఆడారి హరీష్,అంగ రామ్‌ప్రసాద్,పూండి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి సాధించాలి


డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

గోపాలపట్నం: స్వయం ఉపాధి సాధించేలా పలు సంస్థలు ఇస్తున్న ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. ఈ మేరకు ఎన్ఏడీ జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నైట్ రైజింగ్ ఫినెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రాజెక్ట్‌పై మహిళలకు సదస్సు నిర్వహించారు. నైట్ రైజింగ్ ఫినెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ గణేష్ మాట్లాడుతూ మహిళల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇంటి వద్ద నుంచే పనులు చేస్తూ ఆదాయం పొందే పలు ప్రాజెక్టులపై వారికి శిక్షణ ఇచ్చి పని కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, సుబ్రహ్మణ్యం సీవో సుధారాణి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే ఆనందం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు.. సంపూర్ణ ఆరోగ్యంతోనే ఇంట్లో ఆనందం సొంతమవుతుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 60వ వార్డు ఇందిరాకాలనీ గ్యాస్ గొడౌన్స్ సమీపంలో శనివారం ఉచిత గుండె వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ఆడారి తులసీరావు ట్రస్టు సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. పేదల కోసం గుండె వైద్య పరీక్షలు,బీపీ, ఆర్‌బీఎస్,ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా తమ వైద్య సిబ్బంది నిర్వహిస్తారన్నారు.సుమారు 180 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, ఏఎంసీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం షిప్‌యార్డ్ మెయిన్ గేటు వద్ద మే డే ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గాజువాక లంక గ్రౌండ్స్‌లో మే డే వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రమణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి రమేష్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఆర్కే బీచ్ వద్ద సైకిల్ ర్యాలీ

మల్కాపురం: పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంరక్షణ్ క్షమాత మహోత్సవ్ ప్రచార కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తున్నారు. మే 8వ తేదీ వరకు ఇవి కొనసాగుతాయి. ఈ కార్యక్రమాల ద్వారా ఇంధన రూపాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆరు గంటలకు ఆర్కే బీచ్ వద్ద సైకిల్ ర్యాలీ(సైక్లోథాన్) నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని సంస్థ ఈడీ వి.రతన్‌రాజ్ అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారు. వచ్చే నెల 8 వరకు హెచ్‌పీసీఎల్ యాజమాన్యం సంరక్షణ్ మహోత్సవ్ ప్రచారాలు, వివిధ కార్యక్రమాలను చేపడుతుంది.

నిధులు కేటాయించాలని వినతి


కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: వార్డు పరిధిలోని పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి అవసరమైన నిధులను కేటాయించాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం అందజేశారు. వార్డులో జీవీఎంసీ ఉన్నత,ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని నాడు నేడు కింద నిధులు కేటాయించాలని కోరారు. అలాగే వెంకన్నపాలెం ప్రాంతానికి అంబులెన్స్.. వార్డులో ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు,కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని,వాటి స్థానంలో కొత్తవి వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు భోజనాల పంపిణీ


చిన్నారులకు భోజనాలు వడ్డిస్తున్న రమణయాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవవీధి ప్రాంతానికి చెందిన సామాజికసేవా కార్యకర్త, హెచ్‌పీసీఎల్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.వి. రమణ అనాథ పిల్లలకు శనివారం భోజనాలు,పుస్తకాలు,పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. స్ఫూర్తి అనాథ ఆశ్రమంలో 150 మంది పిల్లలకు ఆయన వీటిని అందించారు. కార్యక్రమంలో గోపి,కమలాకర్,దినేష్,శిరీషాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది లింగంపల్లి శ్రీనివాస్ మృతి


లింగంపల్లి శ్రీనివాస సత్యనారాయణ(ఫైల్)

అల్లిపురం: సీనియర్ న్యాయవాది లింగంపల్లి శ్రీనివాస సత్యనారాయణ శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎన్‌బీఎం న్యాయ కళాశాల పూర్వ విద్యార్థి అయిన ఆయన 29 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఎన్‌బీఎం న్యాయకళాశాల విద్యార్థి నాయకుడిగా, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సేవలందించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి సంతాపం వ్యక్తం చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పి.నరసింగరావు, ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, గీతం కళాశాల అధ్యాపకులు ఆచార్య రాఘవయ్య, ఆచార్య అనితారావు, ఎన్‌బీఎం న్యాయకళాశాల అధ్యాపకులు డీవీ రమణ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేవీ స్వామి సంతాపం తెలిపారు.

'పశ్చిమ' సోషల్ మీడియా లోగో ఆవిష్కరణ


లోగో ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సోషల్ మీడియా లోగోను ఆ పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి ఆవిష్కరించారు.ఆనంద్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సోషల్ మీడియా ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశ్చిమ సోషల్ మీడియా కన్వీనర్ మడక శ్రీనివాసరావు,కో–కన్వీనర్ స్పందన బాబూరావు,సంపత్‌కుమార్,కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖ


సీపీ త్రివిక్రమ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొండు సీతారాం

దొండపర్తి: అందరి సహకారంతో బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శనివారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో కేసులు, బాలల అక్రమ రవాణా, విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరా వంటి అంశాలపై చర్చించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. బాల్యవివాహాలపై ఎఫ్ఐఆర్, పిల్లలతో యాచక వృత్తి చేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని సీతారాం సీపీ కలిసిన వారిలో లవకుశ ఉన్నారు.

కార్మికులకు అండగా పోరాటాలు


షిప్‌యార్డ్ ఉద్యోగి రమణమూర్తిని సత్కరిస్తున్న కార్మికులు, నాయకులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంవీ రమణమూర్తి శనివారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా షిప్‌యార్డ్ కార్మికులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు చంటిబాబు, గౌరవాధ్యక్షుడు రమణమూర్తి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యంతో రాజీలేకుండా పోరాడి కార్మికుల మన్ననలు పొందారన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని రమణమూర్తిని కోరారు. అనంతరం సత్కారగ్రహీత రమణమూర్తి మాట్లాడుతూ భవిష్యత్తులో షిప్‌యార్డ్ కార్మిక వర్గానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు


విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు అందిస్తున్న సుబ్బిరెడ్డి

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ, జిల్లా సెట్విస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కంచరపాలెం పాత ఐటీఐలో యువతకు కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిని జిల్లా ఉపాధి కల్పనాధికారి(క్లరికల్), జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య నిర్వహణాధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి ప్రారంభించారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఉన్నత అవకాశాలు పొందాలని అధికారులు సూచించారు. నైపుణ్యం గల మానవ వనరుల కొరత ఉందన్నారు. సాంకేతిక విద్యలైన ఐటీఐ, పాలిటెక్నిక్ అభ్యసించిన వారికి ఎటువంటి ఢోకా లేదని సుబ్బిరెడ్డి తెలిపారు. విద్యార్థులను ఆయన కెరీర్ గైడెన్స్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ధరణి సంస్థ కార్యదర్శి బి.హరివెంకటరమణ, ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వై.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ, సత్యనారాయణ తదితరులు

గోపాలపట్నం: నేటి విద్యార్థులు భావి పారిశ్రామిక వేత్తలు కావాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన స్టార్టప్ ప్రీమియర్ లీగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు సృజనాత్మకతతో రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శనకు ఇదొక వేదిక కావడం, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం మంచి విషయమన్నారు. ఇందుకు కృషి చేస్తున్న సర్వజ్ఞ ఫౌండేషన్, నంబర్ వన్ ఓటీటీ సంస్థ, దర్బార్ ఎంటర్‌టైన్ మెంట్ సంస్థలను అభినందించారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ జి సత్యనారాయణ మాట్లాడుతూ మంచి కార్యక్రమానికి తమ కళాశాల వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల్లో ఉన్న మేధా శక్తిని ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. స్టార్టప్‌గా ప్రారంభమైన వారి ప్రయాణం మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. నంబర్‌వన్ ఓటీటీ సంస్థ సీఎండీ మంచాల సాయి సుధాకర్ నాయుడు, సర్వజ్ఞ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ కార్యక్రమంలో ముంబయ్, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విజయవాడతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పారిశ్రామిక వేత్తలు, బ్యాంకర్లు హాజరయ్యారని తెలిపారు.కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక ఆర్టీసీ డిపోలో తనిఖీలు


డిపో అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ అప్పలనాయుడు

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా డిపో అధికారులతో ఆయన మాట్లాడారు. స్పెషల్ బస్సుల సర్వీసుల ఎలా ఉన్నాయి, అవి సక్రమంగా గమ్యస్థానాలకు చేరుతున్నాయా, మధ్యలో మొరాయిస్తున్నాయా అన్న దానిపై ఆరా తీశారు. ఆ బస్సులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా డిపో మెకానికల్ విభాగ సిబ్బంది పరిశీలించి అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్యారేజ్, ట్రాఫిక్ సెక్షన్లను పరిశీలించారు. అక్కడి డ్రైవర్లు, కండక్టర్లకు పలు సూచనలిచ్చారు. డిపో మేనేజర్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను గుర్తించింది జగనే..

జీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

ఎంవీపీకాలనీ : బీసీలకు సముచిత స్థానం కల్పించింది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. అనకాపల్లి వేదికగా బీసీ గర్జన సభలో పాల్గొనేందుకు కృష్ణయ్య విశాఖ వచ్చారు. ఎయిర్‌పోర్టులో నగర బీసీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయంగా, సామాజికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు గౌరవం దక్కుతోందన్నారు. వివిధ అంశాలపై నగర బీసీ నాయకులతో కృష్ణయ్య చర్చించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్ బోను దుర్గా నరేష్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లా నివాస్, రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, బీసీ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు అనచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం


దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు శనివారం నాటికి 807వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో క్యాప్ టీడీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఆర్ అండ్ డీ, ఈటీఎల్ విభాగ ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. కార్యకమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రూ.2.50 కోట్ల ఆస్తి పన్ను వసూలు


జెడ్సీ కృష్ణకు పన్ను వసూలు జాబితాలు అందిస్తున్న రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5కు సంబంధించి ఒక్క రోజులో అత్యధిక మొత్తం ఆస్తి పన్ను వసూలు చేసినట్లు రెవెన్యూ విభాగం అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు తెలిపారు. శనివారం ఒక్కరోజే రూ.2,50,95,460 ఆస్తి పన్ను వసూలు చేశామన్నారు. విశాఖ కోరమాండల్ సంస్థ నుంచి రూ.1.13 కోట్లు, హెచ్‌పీసీఎల్ నుంచి రూ.1.37 కోట్ల భారీ మొత్తంలో వసూలు చేసినట్లు వివరించారు. ఈ మేరకు జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు పన్ను వసూలు చేసిన జాబితాలను బాబూరావు అందజేశారు. ఒక్కరోజులో ఇంత మొత్తం వసూలు చేసిన రెవెన్యూ సిబ్బందిని జెడ్సీ అభినందించారు. ఈనెల 30 ఆఖరి రోజు కావడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 5 శాతం రాయితీతో ఇంటి పన్ను చెల్లించవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బాబూరావు కోరారు.

క్లుప్తంగా

సంపత్ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ


వేంకటేశ్వరస్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వైశాఖ మాస శుద్ధ నవమి పురస్కరించుకుని ఆలయ అర్చకుడు శ్యామ్‌ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతా భిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పద్మావతి, అలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం


సచివాలయ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సింధు

మల్కాపురం: ప్రజాపిత బ్రహ్మకుమారి (శ్రీహరిపురం)శాఖ ఆధ్వర్యంలో 60వ వార్డు పరిధిలోని శ్రీహరిపురం సచివాలయం సిబ్బందిని శనివారం సత్కరించారు. కరోనా సమయంలో సచివాలయ సిబ్బంది అందించిన సేవలు గుర్తించి సిబ్బందికి శాలువాలు కప్పి,ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎకో బ్రిక్స్ తయారీపై అవగాహన


జేడీ ఫౌండేషన్ సభ్యులకు మొక్క అందిస్తున్న హెచ్‌ఎం కామేశ్వరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఆర్‌హెచ్ వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఎకో బ్రిక్స్ తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాలాది శ్రీరామకృష్ణయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు, బాటిళ్లతో ఎకో బ్రిక్స్ తయారు చేస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆడుతూ పాడుతూ వీటిని తయారు చేయాలన్నారు. వీటిని ఏవిధంగా తయారు చేయాలో వివరించారు. ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు మొక్కలు అందించి జేడీ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు


ప్రత్యేక పూజల్లో అర్చకులు, భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, అర్చనలు పంచామృతాభిషేకాలు జరిపారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు.